సాక్షి
అనంతపురం
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



ఉత్సాహంగా.. ఉల్లాసంగా
శ్రీరామనవమి సందర్భంగా గార్లదిన్నె మండలం కల్లూరులో గ్రామీణ క్రీడా పోటీలు ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. 8లో



సాంకేతిక విద్య.. ఉజ్వల భవిత
డిప్లొమా కోర్సులకు భారీగా డిమాండ్ నెలకొంది. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పాసైన విద్యార్థులు పాలీసెట్ రాయాల్సి ఉంటుంది. 8లో

గరిష్టం/కనిష్టం
38.8°/24.2°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేత్రపల్లి బీపీఎంపై వేటు

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి గ్రామ బ్రాంచ్ పోస్టుమాస్టర్ (బీపీఎం)గా పని చేస్తున్న సి.కె.జనార్దనరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు గుంతకల్లు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ విజయ్‌భాస్కర్ ఆదివారం వెల్లడించారు. కాగా, గ్రామంలోని తపాలశాఖ పరిధిలో రికరింగ్ డిపాజిట్లు, పొదుపు ఖాతాల్లో పలు అవకతవకలకు పాల్పడినట్లుగా జనార్దనరావుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును వారి ఖాతాల్లోకి జమ చేయని అంశంపై ఇటీవల రాయదుర్గం మండలం 74ఉడేగోళం సబ్ పోస్టుమాస్టార్ నాగాబింక ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమికంగా చేపట్టిన విచారణలో అక్రమాలు బహిర్గతం కావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, జనార్దనరావు అక్రమాలపై లోతైన విచారణకు పోస్టల్ ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

చేతిలోని మొబైల్ లాక్కెళ్లిన దొంగ



బాధితుడు జాఫర్

రాప్తాడు రూరల్: చేతిలో మొబైల్ పట్టుకుని చూస్తుండగా ఓ యువకుడు లాక్కొని ఉడాయించిన ఘటన ఆదివారం సాయంత్రం అనంతపురంలో చోటు చేసుకుంది. వివరాలు... అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ దర్గాకొట్టాలుకు చెందిన జాఫర్ పెయింటింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనిపై ఆదివారం నగరానికి వచ్చిన ఆయన సాయంత్రం బళ్లారి రోడ్డు కూడలిలో ఆటో కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో ఫోన్ రింగ్ కావడంతో జేబులో నుంచి తీసి చూస్తుండగా రెప్పపాటులో ఓ యువకుడు లాక్కొని కళ్యాణదుర్గం రోడ్డు వైపుగా పరుగుతీశాడు. జాఫర్ తేరుకుని గట్టిగా కేకలు వేసినా లాభం లేకపోయింది. చీకట్లు ముసురుకుంటుండడంతో సెకన్లలోనే ఆ యువకుడు కనిపించకుండా పోయాడు. ఇటీవలే రూ. 20 వేలు పెట్టి మొబైల్ కొనుగోలు చేశానని, ఇంతలో ఇలా జరిగిందంటూ బాధితుడు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

పుట్లూరు: శ్రీరామనవమి సందర్భంగా పుట్లూరు మండలం రంగమనాయునిపల్లిలో ఆదివారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉదయం ఆలయంలో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను చూసేందుకు పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



బార్‌ను తలపిస్తున్న పాత తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వేపులపర్తి గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. అయితే మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు 30 గ్రామాలకు ప్రత్యేక వాహనాల్లో మద్యం సరఫరా చేస్తూ.. 50కి పైగా బెల్టు షాప్‌లు నడుపుతున్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు. మండల కేంద్రంలో అయితే ఏకంగా పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే మద్యం విక్రయాలు చేపట్టి, అక్కడే తాగేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణం ఓ బార్‌లా మారింది. ఎటుచూసిన తాగి పడేసిన మద్యం బాటిళ్లే కనిపిస్తున్నాయి. అదే తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంక్ వద్దకు వచ్చి నీటిని తీసుకెళ్లేందుకు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నామమాత్రంగా గ్రామాల్లో తనిఖీలు చేపట్టి చేతులు తడుపుకునే అధికారులు.. పాత తహసీల్దార్ కార్యాలయం వైపుగా కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

తిప్పొద్దు.. తిప్పలు పడనీ..

- మూడు రోజుల క్రితం జిల్లాలోని ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తన నియోజకవర్గ పరిధిలో రేషన్ బండ్లు ఒక్కటి కూడా తిరగకూడదని హుకుం జారీ చేశారు. తిప్పాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని అధికారులు చెప్పినా వినలేదు. 'నేను చెబుతున్నా.. తిప్పకూడదంటే తిప్పకూడదు, కాదని తిప్పితే పరిస్థితి వేరేలా ఉంటుంది' అని హెచ్చరించారు.
- రెండు నెలల క్రితం ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే వద్దకు డీలర్ వచ్చి రేషన్ బండి తిప్పాలంటూ సీఎస్‌డీటీ ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదు చేశాడు. దీంతో సదరు సీఎస్‌డీటీని పిలిపించిన ఎమ్మెల్యే చిందులు తొక్కారు. 'ఏం తమాషాగా ఉందా... బండి తిప్పాలని ఒత్తిడి చేస్తున్నావట... ఉండాలని లేదా' అంటూ వార్నింగ్ ఇచ్చారు. 'నా నియోజకవర్గంలో డీలర్లే సరుకులు పంపిణీ చేస్తారు. బండ్లు తిరగకూడదు.. ఇదే మాట మీ అధికారులకు చెప్పు' అంటూ హుకుం జారీ చేశారు.



ఎండీయూ వాహనం

- ఎండీయూల్లో సరుకుల పంపిణీ చేయొద్దని ఎమ్మెల్యేల హుకుం
- కచ్చితంగా తిప్పాల్సిందేనంటూ ప్రభుత్వం ఆదేశం
- తీవ్ర ఒత్తిడికి గురవుతున్న అధికారులు
- వాహనాలు కదలకున్నా తిరుగుతున్నాయంటూ బిల్లులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ ఆదేశాలను ఎమ్మెల్యేలు కనీసంగానూ లెక్క చేయడం లేదు. 'సర్కారుది ఒకదారైతే... మాది మరోదారి' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నా వారికి పట్టడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థలో వెలుగుచూసిన ఓ వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ఒక వైపు ప్రభుత్వమేమో రేషన్ బండ్ల (ఎండీయూ) ద్వారా బియ్యం, సరుకులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశిస్తుంటే.. మరోవైపు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలో ఎండీయూలు తిరగకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. భయంతో కొందరు సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

తప్పుడు లెక్కలతో నివేదిక..

ఎండీయూలు కదలకుండా ఉంటున్నా.. ప్రతి నెలా వాటి ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు ప్రభుత్వానికి అధికారులు తప్పుడు లెక్కలతో నివేదికలు పంపిస్తున్నట్లు తెలిసింది.జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 405 ఎండీయూలు ఉన్నాయి. వీటిలో 297 వాహనాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నట్లు, 27 తాత్కాలికంగా పనిచేస్తున్నట్లు, 81 వాహనాలు పనిచేయడం లేదంటూ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ క్రమంలో ఒక్కో వాహనానికి రూ.21 వేల లెక్కన 324 వాహనాలకు ప్రతి నెలా రూ.68.04 లక్షలు వేతనం కింద విడుదలవుతుండటం గమనార్హం. వాస్తవంగా 405 వాహనాలకు గానూ క్షేత్రస్థాయిలో 30 ఎండీయూలకు మించి పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. దీన్ని బట్టి తిరగని వాహనాలకూ వేతనం చెల్లిస్తుండడం అవినీతిలో మరో కోణం!

రెవెన్యూ డివిజన్	మొత్తం వాహనాలు	పనిచేస్తున్న వాహనాలు	తాత్కాలికంగా పనిచేస్తున్నవి	పూర్తిగా పనిచేయనవి
అనంతపురం	173	135	14	24
కళ్యాణదుర్గం	123	87	9	27
గుంతకల్లు	109	75	4	30
మొత్తం	405	297	27	81



అనంతపురంలోని ఓ రేషన్ షాపు వద్ద సరుకుల కోసం బారులు తీరిన కార్డుదారులు

మచ్చుకు కొన్ని....

- అనంతపురం అర్బన్‌లో 39 ఎండీయూలు ఉంటే 35 పూర్తిస్థాయిలో, ఒకటి తాత్కాలికంగా పని చేస్తున్నాయని, మూడు పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా అనంతపురం అర్బన్ పరిధిలో రెండు, మూడు తప్ప మిగిలినవి తిరగడం లేదు. వాటిని కూడా ఒకట్రెండు రోజులు మాత్రమే తిప్పుతున్నారు.
- అనంతపురం రూరల్ పరిధిలో 20 ఎండీయూలు ఉంటే 18 పూర్తిస్థాయిలో, ఒకటి తాత్కాలికంగా పనిచేస్తుండగా, ఒకటి పని చేయడం లేదు. అయితే అధికారుల ఒత్తిడితో రెండు, మూడు వాహనాలు ఒకట్రెండు రోజులు మొక్కుబడిగా తిప్పుతున్నారు.
- గుత్తిలో 16 ఎండీయూలు ఉండగా అన్ని వాహనాలు తిరుగుతున్నట్లు అధికారిక నివేదిక చెబుతోంది. అదే విధంగా పామిడి మండలంలో 11 ఎండీయూలు ఉంటే అన్నీ తిరుగుతున్నట్లు చూపిస్తున్నారు.
- కణేకల్లు మండలంలో 11 వాహనాలు ఉంటే 11 తిరుగుతున్నట్లు, గుమ్మఘట్టలో 10 ఎండీయూలు ఉంటే 10 తిరుగుతున్నట్లు, డి.హీరేహాళ్‌లో 9 ఉంటే అన్నింటి ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కావాల్సినంత నొక్కడానికే...

'కూటమి' అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యేలు పాత డీలర్లను తొలగించి తమ పార్టీ వారిని నియమించారు. ఈ క్రమంలో ఎండీయూల ద్వారా అయితే రేషన్ సరుకుల నొక్కుడుకు అవకాశం ఉండదనే ఆలోచనతో డీలర్లు అడ్డుపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాహనం ద్వారా పంపిణీ చేస్తే బియ్యం, కంది పప్పు, చక్కెర నొక్కేసేందుకు వీలుండదు. కోటా మేరకు వాహన నిర్వాహకుడికి సరుకులు అప్పగించాలి. అదే స్టోర్ ద్వారా అయితే తూకంలో మోసం చేసి రెండుమూడు కిలోల బియ్యం తక్కువగా, ఇక మిగతా సరుకులు ఇవ్వకుండా మిగుల్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ నొక్కుడు కోసమే ఎండీయూల ద్వారా రేషన్ పంపిణీ చేయకుండా ఎమ్మెల్యేల ద్వారా అధికారులపై డీలర్లు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. ఈ అంశంపై డీఎస్‌ఓ (జిల్లా పౌర సరఫరాల అధికారి) జగన్మోహన్ వివరణ తీసుకునేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రేపు జగన్ పర్యటన

- పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య కుటుంబానికి పరామర్శ



రామగిరి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం నాటి జిల్లా పర్యటన ఖరారైంది. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువులైన టీడీపీ నాయకుల చేతిలో దారుణహత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయన రానున్నారు. పర్యటన షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదివారం మీడియాకు విడుదల చేసింది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని నివాసం నుంచి రోడ్డు మార్గాన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.40 గంటలకు చెన్నేకొత్తపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వస్తారు. అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి 10.50 గంటలకు రోడ్డు మార్గాన ఎన్ఎస్ గేట్ మీదుగా బయల్దేరి 11.05 గంటలకు పాపిరెడ్డిపల్లికి చేరుకుంటారు. 12.05 గంటల వరకు లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్తారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి కాన్వాయ్‌లో చెన్నేకొత్తపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.30 గంటలకు హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయల్దేరుతారు.

ఆలూరు కోనలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో కొలువైన రంగనాథస్వామి మూలవిరాట్

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు భూనీల సమేత శేష తల్ప రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహావచనము, అంకురార్పణ, ధ్వజారోహణము, కలశస్థాపన, దీక్షా హోమంతో ఉత్సవాలను ప్రారంభించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సింహ వాహనంపై స్వామి వారు దర్శనమివ్వనున్నారు.

రామయ్య చల్లని దీవెనలతో జిల్లా సుభిక్షం

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: రామయ్య చల్లని దీవెనలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆకాంక్షించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కృష్ణకళామందిర్‌లోని శ్రీ సీతారాముల దేవాలయంలో రెవెన్యూ సొసైటీ, రెవెన్యూ అసోసియేషన్, రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సంఘాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ దంపతులు పాల్గొని సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారాముల కృపా కటాక్షాలతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, తహసీల్దారు హరికుమార్, సంఘాల నాయకులు దివాకర్‌రావు, కుళ్లాయప్ప, సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, భరత్, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు



అన్నదానం చేస్తున్న ఎస్పీ జగదీష్

జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో..

అనంతపురం: జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై స్వామికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. సీతారాముల వారి కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐలు ధరణి కిశోర్, హేమంత్ కుమార్, శేఖర్, జయపాల్ రెడ్డి, ఆర్ఐలు మధు, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ రవిరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మస్టర్లలో మాయాజాలం

- ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం ఉపాధి హామీ పనులకు దాదాపు 83 మంది కూలీలు హాజరైనట్లు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్) యాప్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు నమోదు చేశారు. అయితే అందులో రెండు ఫొటోలను పరిశీలిస్తే కేవలం కూలీలను అటు ఇటు ఉంచి పేర్లు వేర్వేరుగా మార్చి అప్‌లోడ్ చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది.
- అనంతపురం రూరల్ మండలంలో 25 పంచాయతీలు ఉంటే ఆదివారం 3 పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు చేపట్టారు. రాచానపల్లి పంచాయతీలో కేవలం 10 మంది కూలీలు పనులకు వెళ్లగా.. ఏకంగా 42 మంది హాజరైనట్లు అక్కడి మేట్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఒకే ఫొటోను పలు మార్లు యాప్‌లో అప్‌లోడ్ చేసి వేర్వేరు పేర్లు నమోదు చేయడం గమనార్హం. పైగా రామసాని సందీప్‌రెడ్డి, రామసాని స్వప్న అనే ఇద్దరు ఉపాధి పనులకు హాజరైనట్లు చూపి యాప్‌లో మాత్రం ఇద్దరు పురుషులున్న ఫొటో అప్‌లోడ్ చేశారు. ఈ రెండు చోట్లే కాదు.. జిల్లావ్యాప్తంగా పలువురు క్షేత్రస్థాయి సిబ్బంది ఇలానే చేస్తూ ప్రజాధనాన్ని కొల్లగొట్టేస్తున్నారు.





వడ్డుపల్లిలో కూలీల ఫొటోలు ఒకటే అయినా పేర్లు మాత్రం వేర్వేరుగా ఉన్న దృశ్యం





రాచానపల్లి పంచాయతీలో రెండు ఫొటోలు ఒకటే.. కూలీల పేర్లు మాత్రం వేర్వేరుగా

ఫీల్డ్ అసిస్టెంట్లకే 'ఉపాధి'

- పనులకు రాకున్నా మస్టర్లలో పేర్లు
- అధికారుల పాత్రపైనా అనుమానాలు

అనంతపురం టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లకు కల్పవృక్షంలా మారింది. కూలీలు పనులకు రాకున్నా మస్టర్లలో పేర్లు నమోదు చేస్తూ నిధులను కొల్లగొట్టేస్తున్నారు. 10 మంది కూలీలు పనులకు హాజరైనా.. వందల మంది వచ్చినట్లు చూపుతూ బోగస్ మస్టర్లను సృష్టించి నిధులను మింగేస్తున్నారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లోని 81 పంచాయతీల్లో పనులు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు 431 మస్టర్లు నమోదు చేసి దాదాపు 2,611 మంది కూలీలు హాజరైనట్లు ఫొటోలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేశారు. అయితే, శ్రీరామ నవమి పర్వదినం కావడంతో చాలా మంది పనులకు రాకపోయినా, హాజరైన వారినే అటు ఇటుగా ఫొటోలు తీసి బోగస్ వివరాలను యాప్‌లో నమోదు చేయడం గమనార్హం.

చర్యలు తీసుకున్నా ఏదీ మార్పు..?

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడిన రాప్తాడు మండలం గొల్లపల్లి, ఆత్మకూరు మండలం రంగంపేట, తోపుదుర్తి గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లపై గత నెలలో అధికారులు చర్యలు తీసుకున్నారు. అయినా, పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లలో మార్పు కనిపించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం, మస్టర్లు పరిశీలించకుండానే బిల్లులు చేస్తుండటంతోనే ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారుల పాత్రపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి.



ఫొటోలో ఇద్దరూ పురుషులే ఉన్నా.. ఆడ, మగ అని అప్‌లోడ్ చేశారు..

బోగస్ మస్టర్లు సృష్టిస్తే ఇంటికే

ఉపాధి హామీ పనుల్లో బోగస్ మస్టర్లు సృష్టిస్తే ఇంటికి పంపిస్తాం. దీంతో పాటు అక్రమాలకు పాల్పడిన మొత్తాన్ని తిరిగి రాబడతాం. ఇప్పటికే పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకున్నాం. వడ్డుపల్లి, రాచానపల్లిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైతే తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే వారిని ఉద్యోగాల నుంచి కూడా తొలగిస్తాం.

– సలీంబాషా, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

కమనీయం.. సీతారాముల కల్యాణం



గజ వాహనంపై కొలువుదీరిన సీతారామ చంద్రులు



పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ సిబ్బంది

- కసాపురంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తుల రామనామ స్మరణ మధ్య సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం వేకువ జామునే ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అర్చకులు అనంతరం ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సీతారాముల ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి పల్లకీపై కొలువుదీర్చారు. ఆలయ ఈఓ వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఆధ్వర్యంలో స్వామివార్లను, కల్యాణోత్సవ సామగ్రిని, పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుముహూర్తాన మాంగల్య ధారణ గావించారు. మహామంగళ హారతితో ఘట్టాన్ని ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రెండు గంటల పాటు సాగిన ఉత్సవంలో భక్తులు రామనామస్మరణ చేస్తూ తన్మయత్వం పొందారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను గజవాహనంపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

జగన్‌కు మద్దతుగా నిలుద్దాం

- కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు బిల్లే మంజునాథ్ పిలుపు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో కురుబలను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లి అన్ని విధాలుగా అండగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుబలు మద్దతుగా నిలవాల్సిన తరుణం ఆసన్నమైందని, వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు బిల్లే మంజునాథ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ లింగమయ్యను టీడీపీ నాయకులు ఇటీవల హత్య చేశారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబం నుంచి తమకు ప్రాణహాని ఉందని హతుడి కుమారుడు మీడియా ముందు బహిర్గతం చేశారని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి కురుబలందరూ అండగా నిలవాలన్నారు. లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న వైఎస్ జగన్ రానున్నారని, కురుబలు పెద్ద ఎత్తున పాపిరెడ్డిపల్లికి తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో కురుబల మీద ఎలాంటి దాడులు జరగకుండా అందరూ ఐక్యంగా నిలవాలని కోరారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా కురుబలు వైఎస్సార్‌సీపీకి పూర్తిస్థాయిలో మద్దతు నివ్వాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


మృతురాలు అర్చన

కూడేరు: ఉత్తీర్ణతపై అనుమానంతో ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం జయపురం గ్రామానికి చెందిన మదన్‌మోహన్, సునీత దంపతులకు కుమార్తె అర్చన (16), ఓ కుమారుడు ఉన్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న అర్చన ఇటీవల మొదటి సంవత్సరం పరీక్షలు రాసి ఇంటికి చేరుకుంది. పరీక్షలు సక్రమంగా రాయలేకపోయానని, ఫెయిల్ అవుతానంటూ తల్లిదండ్రులతో చెప్పుకుని బాధపడేది. ఈ క్రమంలోనే తీవ్ర మానసిక సంఘర్షణకు లోనైన అర్చన... ఆదివారం వేకువజామున ఇంట్లోనే బాత్రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి దుర్మరణం


రాఘవేంద్ర గౌడ్ (ఫైల్)

గుత్తి: ట్రాక్టర్ ట్రాలీ కింద చిక్కుకుని ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం పెద్దొడ్డి గ్రామానికి చెందిన రమణ, సుజాత దంపతుల చిన్న కుమారుడు విజయ్ రాఘవేంద్రగౌడ్ (19) ఆదివారం ఉదయం చెర్లోపల్లి గ్రామ సమీపంలో నుంచి ఎరువును తరలించేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. ట్రాలీలోకి ఎరువు లోడు చేస్తుండగా హైడ్రాలిక్ లిఫ్ట్ పనితీరును పరిశీలించాడు. లిఫ్ట్ సక్రమంగా పనిచేయక పోవడంతో కిందకు సరి చేస్తుండగా ఉన్నఫళంగా ట్రాలీ కిందకు దిగింది. దీంతో ట్రాలీ కింద చిక్కుకున్న విజయ్‌రాఘవేంద్రను స్థానికులు గమనించి వెలికి తీసేలోపు మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాంకేతిక విద్య.. ఉజ్వల భవిత

- డిప్లొమా కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఈ నెల 30న పాలీసెట్
- పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ



పాలిటెక్నిక్ కళాశాల

అనంతపురం: డిప్లొమా కోర్సులకు డిమాండ్ భారీగా నెలకొంది. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాలీసెట్ రాయాల్సి ఉంటుంది. ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ పాలీసెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులకు ఆసక్తి ఉన్న ఏ కోర్సులోనైనా చేరి ఇష్టంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

చిరుప్రాయంలోనే ఐదు అంకెల వేతనం..

పూర్తిగా ప్రాక్టికల్ ఓరియంటెడ్ సిలబస్ ఉన్న పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. దీంతో 19 సంవత్సరాల్లోపే రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనం అందుకునే అవకాశముంది. తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య పూర్తి చేసే అవకాశం కేవలం డిప్లొమా కోర్సులతోనే సాధ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. సింహభాగం కంపెనీలు సైతం ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారి కంటే డిప్లొమా పూర్తి చేసిన వారినే ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డిప్లొమా కోర్సుల్లో విద్యార్థులను తీర్చిదిద్దడమే ఇందుకు కారణం. ఇంటర్మీడియట్ తరువాత ఇంజినీరింగ్ కోర్సు చదివితే ఆరు సంవత్సరాల కాల వ్యవధి అనివార్యం. ఇలా కాకుండా కేవలం పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం మూడేళ్లలో డిప్లొమా కోర్సు పూర్తి చేస్తే కొలువు దక్కడం ఖాయమని సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు.

కోర్ బ్రాంచ్‌లే అధికం..

ఇంజినీరింగ్‌లో కోర్ బ్రాంచ్‌ల్లో గణనీయంగా అడ్మిషన్లు పడిపోయి కొత్త బ్రాంచ్‌ల వైపు విద్యార్థులు చూస్తున్నాయి. కానీ డిప్లొమోలో కోర్ బ్రాంచ్‌లకే డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ వంటి కోర్ బ్రాంచ్‌లతో పాటు కంప్యూటర్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా దక్కుతాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ ఇంజినీరింగ్ కళాశాలల్లో తరచూ ఉద్యోగమేళాలు నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో కోర్సు పూర్తి చేయడానికి మూడేళ్లకు కలిపి కేవలం రూ.13 వేలు ఖర్చు అవుతుంది. ఆ తర్వాత ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ కింద) నేరుగా చేరవచ్చు. లేదా ఉద్యోగంలో చేరవచ్చు.

పాలీసెట్ ఎంట్రెన్స్ ఇలా..

పాలీసెట్‌ను 120 మార్కులకు నిర్వహిస్తారు. గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఈ ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ నెల 30న పాలీసెట్ నిర్వహించనున్నారు.

ఉచిత శిక్షణ

పాలీసెట్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కోచింగ్ ఇస్తున్నాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎవరైనా ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చు.

– సి.జయచంద్రారెడ్డి, పాలీసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, అనంతపురం

హిటాచీకి నిప్పు


కాలిపోయిన హిటాచీ వాహనం

ధర్మవరం రూరల్: మండలంలోని ఓబుళనాయనపల్లి సమీపంలోని గుట్టలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్న హిటాచీన వాహనానికి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పోలీసులు తెలిపిన మేరకు... ఓబుళనాయనపల్లి వద్ద ఉన్న గుట్టలోని మట్టిని టిప్పర్లకు వేసేందుకు ధర్మవరం పట్టణానికి చెందిన కిషోర్ వద్ద ఉన్న హిటాచీ వాహనాన్ని శివ లీజుకు తీసుకున్నాడు. శనివారం రాత్రి హిటాచీని అక్కడే ఉంచి డ్రైవర్, హెల్పరు ఇంటికి వెళ్లిపోయారు. ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు వాహనంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో పూర్తిగా కాలిపోయింది. ఆదివారం ఉదయం అక్కడికెళ్లిన డ్రైవర్ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ధర్మవరం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మట్టి తవ్వకాల్లో తలెత్తిన విభేదాల కారణంగా నిప్పు పెట్టి ఉండవచ్చునని స్థానికులు అనుమానిస్తున్నారు.

వాహనం ఢీకొని నక్క మృతి



రొళ్ల: మండలంలోని టీడీ పల్లి క్రాస్ సమీపంలో 544ఈ జాతీయ రహదారి మలుపు వద్ద ఆదివారం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని నక్క మృతి చెందింది. అటవీ ప్రాంతంలో తాగునీరు, సరైన ఆహారం లభ్యం కాక కొడగార్లగుట్ట గ్రామం వైపుగా వెళుతూ జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో వాహనం ఢీకొని కుడి వైపున ఉన్న రెండు కాళ్లూ విరిగాయి. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న నక్కకు గ్రామస్తులు ఉపశమన చర్యలు చేపట్టారు. రోడ్డు మధ్యలో నుంచి పాకుకుంటూ పక్కనే ఉన్న రాళ్ల మధ్యలోకి దూరింది. సమాచారం అందుకున్న వైల్డ్‌లైఫ్ వాచర్ భీమప్ప అక్కడకు చేరుకుని, గాయపడిన నక్కను ఆస్పత్రికి తరలించేలోపు మరణించింది. అనంతరం టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న అటవీ శాఖ నర్సరీలో నక్క కళేబరాన్ని ఖననం చేశారు.

అశాస్త్రీయ సంస్కరణలపై ఉద్యమిద్దాం

- ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం
- ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) నాయకుల పిలుపు


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్యలో జీఓ 117 రద్దుకు సంబంధించిన అశాస్త్రీయమైన సంస్కరణలపై ఉద్యమించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కె.కులశేఖరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ మాట్లాడారు. ఉపాధ్యాయ సీనియార్టీ జాబితాలో ఉన్న తప్పిదాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అప్ గ్రేడ్ కానీ ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. జిల్లా నాయకత్వం పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమంలోనూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సభ్యులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఫెడరేషన్ సబ్ కమిటీ సభ్యులు వజీర్ బాషా, అశోక్ నాయక్, కమిటీ సభ్యులు నరసింహులు, రమేష్ రెడ్డి, సూరి, నాగిరెడ్డి నారాయణ నాయక్, హుస్సేన్ ఖాన్, ఆదినారాయణ, ఫక్రుద్దీన్, హుస్సేన్ పీరా, వెంకటేశ్వర రెడ్డి, రహంతుల్లా, నారాయణరెడ్డి, గురప్ప పాల్గొన్నారు.

సమ్మెలో ‘శ్రీరామరెడ్డి’ కార్మికులు


పంప్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్/కూడేరు: బకాయి వేతనాలు, పీఎఫ్‌తోపాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులు శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్‌లోని మోటార్లను బంద్ చేశారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం పీఏబీఆర్ వద్ద ఉన్న తాగునీటి ప్రాజెక్ట్, కళ్యాణదుర్గంలోని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పంప్ హౌస్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు రామాంజి, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడారు. శ్రీరామరెడ్డి నీటి సరఫరా కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కూటమి నాయకుల మాటలు నమ్మి గతంలో కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించారని, నాడు ఇచ్చిన హామీ మేరకు నేటికీ సమస్యలు పరిష్కరించలేదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి 600 మంది కార్మికులు దసరా, సంక్రాంతి, ఉగాది, శ్రీరామ నవమి వంటి పండగల పూట పస్తులుండాల్సి వచ్చిందన్నారు. గతంలో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సైతం స్పష్టమైన హామీనిచ్చారని గుర్తు చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి వాటర్ వర్క్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండారెడ్డి, కార్మికులు వన్నూరుస్వామి, ఈశ్వరయ్య, మల్లికార్జున, రమేష్, కాసీం, శ్రీనివాసులు, శ్రీనివాసులు రెడ్డి, రవి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి రత్నగిరిలో బ్రహ్మోత్సవాలు


రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాజవంశీకుడు రంగప్పరాజు (దొర), ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ ఆలయానికి దాదాపు 628 ఏళ్ల నాటి చరిత్ర ఉన్నట్లు పూర్వీకులు చెబుతున్నారు. రాజవంశీకులతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన వారు, సమీపంలోని కర్ణాటక వాసులు తమ ఇలవేల్పుగా అమ్మవారిని కొలుస్తుంటారు. 13న జలధి ఉత్సవం, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 14న బ్రహ్మరథోత్సవం, ధూళోత్సవం, 15న జలధి, కలశ ఉత్సవం, గంగ పూజ, 16 నుంచి 19వ తేదీ వరకు అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలు, 20న అమ్మవారికి పుష్పాలంకారణ, పోతులరాజుల విశేష పూజ, 21న పోతురాజు బండార కార్యక్రమం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా పశువుల జాతరను నిర్వహిస్తుంటారు. బ్రహ్మోత్సవాలకు వచ్చి వెళ్లే భక్తుల సౌకర్యార్థం మడకశిర డిపోతో పాటు కర్ణాటకలోని మధుగిరి, శిర, పావగడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

ఆట పట్టించారంటూ అంతమొందించాడు!


హతుడు నూర్ మహమ్మద్

అనంతపురం: సరదా కోసం స్నేహితులు ఆట పట్టించడంతో కక్ష పెంచుకున్న ఓ యువకుడు తన మిత్రుడిని దారుణంగా హతమార్చాడు. అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు... అనంతపురంలోని కోర్టు రోడ్డులో ఉన్న లింగమయ్య బిరియానీ సెంటర్‌లో శ్రీధర్, గణేష్‌తో పాటు చిన్మయనగర్‌కు చెందిన నూర్ మహమ్మద్ పనిచేస్తున్నాడు. ముగ్గురూ సరదాగా కలిసిమెలిసి ఉండేవారు. ఈ క్రమంలో పనిలో విరామం దొరికినప్పుడు విశ్రాంతి తీసుకునేందుకు అనువుగా రహమత్ నగర్‌లో ఓ గదిని హోటల్ నిర్వాహకులు కేటాయించారు. దీంతో హోటల్‌లో పని ముగించుకున్న అనంతరం ముగ్గురూ కలసి గదికి చేరుకుని మద్యం సేవించి సరదాగా మాట్లాడుకుంటూ ఎంజాయ్ చేసేవారు.

పెళ్లి విషయంలో ఆట పట్టించి...

ముగ్గురు స్నేహితుల్లో నూర్ మహమ్మద్ (42)కు భార్య, ఓ కుమారుడు , కుమార్తె ఉన్నారు. వీరు చిన్మయనగర్‌లోనే ఉంటున్నారు. శ్రీధర్ 2009లో కులాంతర వివాహం చేసుకున్నాడు. దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో 2020లో శ్రీధర్ తన భార్య నుంచి విడాకులు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో మరో పెళ్లికి శ్రీధర్ ప్రయత్నాలు చేస్తుండడంతో నూర్‌మహమ్మద్ అప్పుడప్పుడు సరదాగా ఆట పటిస్తూ నవ్వించేవాడు. ఆ సమయంలో నూర్ మహమ్మద్ మాటలకు గణేష్ వత్తాసు పలికేవాడు. ఈ సరదా మాటలను శ్రీధర్ జీర్ణించుకోలేకపోయాడు. మనసులో పగ పెంచుకుని ప్రతీకారంతో రగిలిపోయాడు. ఆదివారం హోటల్‌లో పనిముగించుకున్న అనంతరం లింగమయ్య బిర్యానీ సెంటర్ ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న గణేష్‌పై శ్రీధర్ దాడి చేశాడు. తనను నూర్ మహమ్మద్ హేళన చేస్తుంటే వత్తాసు పలుకుతావా? అంటూ దాడి చేసి గాయపరిచాడు. అనంతరం రహమత్‌నగర్‌లో ఉన్న రూముకు చేరుకుని అక్కడ నిద్రిస్తున్న నూర్‌మహమ్మద్‌ను గమనించి నల్ల బండరాయితో తలపై బలంగా మోదాడు. నూర్ మహమ్మద్ తేరుకునేలోపే బయట ఉన్న రోకలి బండ తీసుకెళ్లి దాడి చేశాడు. అదే సమయంలో అటుగా వచ్చిన నూర్ మహమ్మద్ స్నేహితుడిని గమనించి.. నూర్ మహమ్మద్‌ను చంపేశానంటూ రోకలి బండ పడేసి వెళ్లిపోయాడు. దీంతో నూర్ మహమ్మద్ స్నేహితుడు గదిలోకి వెళ్లి క్షతగాత్రుడిని వెంటనే తన ఆటోలో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నూర్ మహమ్మద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేమన ఉత్సవాలు ప్రారంభం


వేమన సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో వెలసిన విశ్వకవి యోగి వేమన ఆలయంలో ఉత్సవాలు ఆదివారం రాత్రి ఆలయ పీఠాధిపతి నందవేమారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేమన సమాధిని ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు చేశారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆలయ ప్రధాన ద్వారం ఎదుట ఉడికించిన జొన్నలను భం పోసి పసుపు కుంకుమ కలిపి ఆదిశక్తి పూజలు నిర్వహించారు. అనంతరం జొన్న ధాన్యాన్ని ప్రసాదంగా భక్తులు స్వీకరించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా సోమవారం బండ్ల మెరవణి, ఆర్కెస్ట్రా (పాటల కచేరి) ఉంటుంది. మొక్కుబడి ఉన్న భక్తులు ఎడ్ల బండ్లను అలంకరించి ఆలయం ఎదుట ఉంచి ప్రత్యేక పూజలు చేయిస్తారు.

ఆకట్టుకున్న బాలరాముడి చిత్రం


కాఫీ పౌడర్‌తో చిత్రీకరించిన బాలరాముడి చిత్రం

రామగిరి: శ్రీరామ నవమి సందర్భంగా అరకు కాఫీ పౌడర్‌తో చిత్రీకరించిన బాలరాముడి చిత్రం ఆకట్టుకుంది. ఆదివారం పేరూరు డ్యాంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఏపీఆర్ఎస్) బాలుర పాఠశాలకు చెందిన ఆర్ట్ టీచర్ శ్రీరాములు ఈ చిత్రాన్ని గీశారు. అరకు కాఫీ పౌడర్‌తో సుందరమైన చిత్రాలనూ గీయవచ్చని శ్రీరాములు తెలిపారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..


151 కిలోల బరువున్న ఇసుక మూట ఎత్తుతున్న యువకుడు

గార్లదిన్నె: శ్రీరామనవమి సందర్భంగా గార్లదిన్నె మండలం కల్లూరులో నిర్వహించిన గ్రామీణ క్రీడాపోటీలు ఉత్సాహంగా... ఉల్లాసంగా సాగాయి. అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం ఈ పోటీలను నిర్వహించారు. పోటీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. 151 కిలోల ఇసుక మూట ఎత్తే పోటీల్లో పాల్తూరు రాజు మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. రెండో స్థానంలో కల్లూరు సుధాకర్ నిలిచాడు. 146 కిలోల బరువున్న గుండును ఎత్తే పోటీల్లో మాధవరం రాజశేఖర్ మొదటి స్థానం, ప్యాపిలి మండలానికి చెందిన ఈశ్వరరెడ్డి రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. 60 కిలోల బరువున బండను ఒక్క చేతితో పైకి ఎత్తే పోటీల్లో మొదటి స్థానాన్ని హుస్సేన్ దక్కించుకోగా, రెండో స్థానంలో ఈశ్వర్‌రెడ్డి నిలిచాడు. కర్రసాము పోటీల్లో మొదటి స్థానంలో రాజేష్, రెండో స్థానంలో యాడికి నాగార్జున గెలుపొందారు. ఇరుసు పోటీల్లో మొదటి స్థానంలో నాగులాపురం వనేంద్ర, రెండవ స్థానంలో వంకరాజుకాలువ నరేష్ నిలిచారు. విజేతలను గ్రామస్తులు అభినందించి, నగదు పురస్కారాలతో సత్కరించారు.


146 కిలోల బరువైన గుండును ఎత్తుతున్న దృశ్యం


ఇరుసు ఎత్తు పోటీల్లో పాల్గొన్న యువకుడు


60 కిలోల బరువు ఉన్న బండను ఒక్క చేతితో పైకి ఎత్తిన దృశ్యం


కర్రసాముతో ఆకట్టుకున్న యువకుడు

క్లుప్తంగా

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



శ్రీదేవి ఖడ్గమాల జపిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో వారం రోజులుగా సాగుతున్న అనంతేశ్వరి వసంత నవరాత్రి మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం భక్త బృందాలు ఉదయం నుంచి రాత్రి వరకు వేర్వేరు విభాగాల్లో అమ్మవారి స్తుతి, భక్తిగీతాలాపనలతో అమ్మవారి నామస్మరణ చేశారు. ఆశ్రమ మహిళా మండలి వారి ఆధ్వర్యంలో సామూహిక శ్రీమణిద్వీప వర్ణన, పారాయణం తొమ్మిది పర్యాయాలు చేశారు. అమ్మవారి నామస్మరణతో మార్మోగించారు. అలాగే శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం పారాయణం చేశారు. అనంతరం ఆశ్రమంలో కొలువుదీరిన వివిధ దేవతలకు అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలతో ఆరాధించారు. ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ మాట్లాడుతూ.. సోమవారం ఆశ్రమంలో నవరాత్రి మహోత్సవాలు ముగుస్తాయన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం



మొక్క నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షిద్దామని కళాశాల ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ కురుగుంట గ్రామంలో ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం పలుచోట్ల ఇళ్ల ముందు మొక్కలు నాటారు. మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటుకోవాలని విష్ణుప్రియ సూచించారు. విద్యార్థులు సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



వడ్డుపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రతి ఆదివారం, మంగళవారం వేల సంఖ్యలో భక్తులు వెళ్తుంటారన్నారు. తాగునీటికి భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి, పరంధామ పాల్గొన్నారు.

పంపనూరులో పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరుడి స్వర్ణ కవచాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలతో, అలంకరించి ఆకుపూజ చేశారు. స్వామి వారి స్వర్ణ కవచంతో పాటు శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల చిత్రపటాన్ని ఊరేగించారు. ఆలయంలో కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.



మొదటి రోడ్డు శివాలయంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు





సీతారాముల విగ్రహాలపై తలంబ్రాలు పోస్తున్న అర్చకుడు, జీసస్ నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో రాములోరి కల్యాణం

కల్యాణ వైభోగమే..

- ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఆలయాల్లో సీతారాములకు కల్యాణం జరిపించిన అర్చకులు
- మార్మోగిన శ్రీరామ నామస్మరణ

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో భద్రాచలం, ఒంటి మిట్ట ఆలయాల నుంచి తెప్పించిన ముత్యాల తలంబ్రాలు, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, పట్టువస్త్రాలతో వేదపండితులు సీతరాములకు కల్యాణం జరిపించారు. భక్తమండలి ఆధ్వర్యంలో పది రోజుల పాటూ సాగే బ్రహ్మోత్సవ వేడుకలను ధ్వజారోహణంతో ఆలయ ఈఓ శోభారాణి, నరేంద్ర చౌదరి తదితరులు ప్రారంభించారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో తపోవనంలోని శివశక్తి బాబా మందిరంలో కల్యాణోత్సవం, చందనోత్సవం వేడుకగా సాగాయి. పాతూరు సున్నపు గేరిలోని ప్రాచీన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమనాథ్ నగర్, నాలుగో రోడ్డు, రెవెన్యూ కాలనీ, మారుతీ నగర్, శ్రీనివాస నగర్, గీతామందిర్, కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. లక్ష్మీనగర్‌లోని కోదండ రామాలయంలో కార్పొరేటర్ చింతకుంట మధు, ఐదో రోడ్డు రామాలయంలో అనంత చంద్రారెడ్డి అతిథులుగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. హౌసింగ్ బోర్డులోని నిలువెత్తు అభయాంజనేయ స్వామి ఆలయంలో సాగిన కల్యాణోత్సవంలో డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి రామాయణ వ్యాఖ్యానం అందరినీ ఆకట్టుకుంది.

పానకాల వితరణ

శ్రీరామ నవమి సంప్రదాయాన్ని పాటిస్తూ నగరంలో పలు చోట్ల భక్తులకు పానకం పంపిణీ చేశారు. స్థానిక పీటీసీలోని విఘ్నేశ్వరాలయం సమీపంలో శివాలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రమణ్యం, అంతరాష్ట్రీయ హిందూ పరిషత్ ప్రతినిధులు శ్యామసుందర్, మఠం ఆనంద్, అమర్ తదితరులు భక్తులకు పానకం అందజేశారు. రాజు రోడ్డు, పాతూరు వీధుల్లో జైన్ సంఘం ప్రతినిధులు వివిధ ఆలయాలో స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు పానకం, పెసరపప్పు పంపిణీ చేశారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆత్మకూరులో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సీతారామ, లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రాలు, మేళతాళాల నడుమ కల్యాణం జరిపించారు. వడ్డుపల్లి గ్రామంలో వారం రోజులుగా రాత్రి పగలు భజన కార్యక్రమాలు నిర్వహించారు. పి.యాలేరులో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులకు ఆలయాల వద్ద తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కిటకిటలాడిన ఆలయాలు

రాప్తాడు: శ్రీరామనవమి పండగ సందర్భంగా ఆదివారం మండలంలో పలు గ్రామాల్లో సీతారాముల కళ్యాణం కనుల పండువగా జరిగింది. సీతారాముల కల్యాణం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హంపాపురం సమీపంలోని మౌనగిరిక్షేత్రంలో వెలసిన 39 అడుగుల ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో విశేష పూజల అనంతరం పండితులు శాస్త్రోక్తంగా సీతా రాముల కల్యాణాన్ని జరిపించారు. మరూరు గ్రామ సమీపంలోని ధర్మవరం రోడ్డులో వెలసిన హనుమంతరాయ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయం దగ్గర నిర్వహించిన ఉట్ల పరుష ఆకుట్టుకుంది. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడుతున్న యువత

సందడిగా ఉట్లమాను ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఉట్లమాను ఉత్సవాలు నగరంలో ఆదివారం సాయంత్రం పలుచోట్ల సందడిగా సాగాయి. రామాలయాల వద్ద ఊరేగింపుగా వచ్చిన స్తంభాలకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలు నిర్వహించారు. పాతూరు సున్నపు గేరిలోని రామస్వామి దేవాలయంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య దంపతులు ఉట్లమానుకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. ఐదవ రోడ్డు, మూడవ రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాలు వద్ద జరిగిన ఉట్లమాను ఉత్సవాలను వీక్షించేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. కేరింతలు, శ్రీరామ నామస్మరణ నడుమ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి సాధించారు. అలాగే ఉమానగర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మాజీ మేయర్ రాగేపరుశురాం ప్రసాదం పంపిణీ చేశారు.



సీతారాముల పరిణయ ఘట్టాన్ని వీడియో తీస్తున్న యువతి



రాప్తాడు: మౌనగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణం



పి.యాలేరులో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం



ఐదవ రోడ్డులో సీతారాముల కల్యాణోత్సవం



రైల్వేస్టేషన్ వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

వివాహిత ఆత్మహత్య

అనంతపురం: నగరంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కె.సాయినాథ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయల్‌నగర్‌కు చెందిన మాల్యవంతం రాజాకు గార్లదిన్నె మండలం ముంటిమడుగు గ్రామానికి చెందిన రత్న (35)తో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఆదివారం తెల్లవారుజామున రత్నకు కడుపు నొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లోనే చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఆదివారం శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామంలోని 10 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా మొదటి బహుతి యంపలాకు నాగేష్ వృషభాలు, ద్వితీయ బహుమతి రామా రమేష్ దేశపు ఎద్దులు, తృతీయ బహుమతి కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి ఎద్దులు గెలుపొందాయి. కోడెల విభాగంలో జడ్ వీరారెడ్డి వృషభాలు ప్రథమ స్థానం, అక్కిలి నారాయణరెడ్డి(బొజ్జయ్య) ద్వితీయ స్థానం, కలగ్ల రంగనాయకులు వృషబాలు తృతీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

హిందువుల ఐక్యతే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన రావు



కోలాటం ఆడుతున్న మహిళలు

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు దర్పణమైన శ్రీరామ నవమి వేడుకలు అందరిలో ఐక్యతను తెచ్చి పటిష్ట భారతదేశాన్ని నిర్మించాలని బీజేపీ జాతీయ నాయకుడు, ఎంపీ రఘునందన రావు ఆకాంక్షించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుందరంగా అలంకరించిన రాముడి చిత్రపటాన్ని ఊరేగించారు. డీజే శబ్దాల ముందు యువత డ్యాన్స్ చేశారు. ర్యాలీ స్థానిక కొత్తూరు జూనియర్ కాలేజ్ వద్దకు చేరుకుంది. మంత్రి సత్యకుమార్ యాదవ్, చిన్మయామిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి తదితరులు శ్రీరామ నవమి ప్రాశస్త్యాన్ని వివరించారు. నిలువెత్తు హనుమంతుడి వేషధారి ఆకట్టుకున్నాడు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ దూపకుంట్ల శబరి, సభ్యులు విశ్వనాథరెడ్డి, భవాని రవికుమార్, గల్లా హర్ష, హితేష్ జైన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మురళీధర్, బీజేపీ నాయకులు సందరెడ్డి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

సేవ చేయడం అభినందనీయం

అనంతపురం ఎడ్యుకేషన్: గణిత శాస్త్రంలో డాక్టరేట్ పొందిన ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజావత్ నారాయణ నాయక్, ఫ్యాప్టో చైర్మన్ ఆర్.శ్రీనివాస నాయక్, ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ బి.పురుషోత్తంను రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్‌ఈఎఫ్) ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆర్‌ఈఎఫ్ జాతీయ కో-ఆర్డినేటర్ జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు టి.రాజా రమేష్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్కే యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఆర్ట్స్ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ రంగస్వామి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సంఘాల్లో పని చేస్తూ నాయకులుగా ఎదిగి సేవ చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు పరస్పరం సహకరించుకుంటూ ఐక్యతను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్లు జి. శ్రీనివాసులు, ఎం. ఓబులేసు, బి. ఉమా శంకర్, మావిటి శ్రీరాములు, డాక్టర్ జి. సతీష్ కుమార్, బీసీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరప్ప, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈజీ నాగభూషణం, జిల్లా అధ్యక్షులు పిడుగు శ్రీనివాసులు, ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఎస్టీయూ సూర్యుడు, వాల్మీకి ఉద్యోగుల సంఘం గంగాధర్, సచివాలయ ఉద్యోగుల సంఘం వరప్రసాద్ పాల్గొన్నారు.



నారాయణ నాయక్, శ్రీనివాస నాయక్, పరుషోత్తంను సన్మానించిన దృశ్యం

సంతల ఆదాయం రూ.3.66 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈవారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.66 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత నుంచి రూ.2,25,090 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, గేదెలు, ఎద్దుల సంత నుంచి రూ.1,41,350 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

ఫోన్ చేయండి.. సమస్య పరిష్కరించుకోండి

- 24 గంటలు అందుబాటులో విద్యుత్ సిబ్బంది
- ప్రాంతాల వారీగా ప్రత్యేక ఫోన్ నంబర్ల కేటాయింపు

అనంతపురం టౌన్: ప్రస్తుత వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్‌శాఖ నగరంలోని ప్రాంతాల వారీగా ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసేలా చర్యలు చేపట్టింది. విద్యుత్ సమస్యలపై అర్ధరాత్రి ఫోన్ చేసిన వినియోగదారుడి ఇంటి వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు రాత్రి వేళల్లో సైతం సిబ్బందిని అందుబాటులో ఉంచుతోంది. ప్రస్తుతం వేసవి కాలంలో ఎక్కడైన విద్యుత్ సమస్యలు తలెత్తితే ఫోన్ చేసిన వెంటనే విద్యుత్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తారని విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషాద్రి శేఖర్ తెలిపారు.

- **డిస్ట్రిబ్యూషన్-1 సెక్షన్:** ఈ సెక్షన్ పరిధి భవాని నగర్, ఆమూదాల స్ట్రీట్, అంబేద్కర్‌నగర్, సంఘమేష్ సర్కిల్, కలెక్టర్ కార్యాలయం, అనంత సాగర కాలనీ, నీరుగంటి వీధి, బోయ స్ట్రీట్, సున్నపు గేరు, అసార్ స్ట్రీట్, వీరభద్ర కాలనీ ఈ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలుంటే 7382605301 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలి.
- **డీ-2 సెక్షన్:** శ్రీనివాస నగర్, రామచంద్ర నగర్, ఎర్ర నేలకొట్టాల, షిర్డినగర్, లెక్చరర్స్ కాలనీ, ప్రకాష్ రోడ్డు, రెవెన్యూ కాలనీ, కమలానగర్, గుల్జార్ పేట, ఆదిమూర్తి నగర్, సుభాష్ రోడ్డు, కోర్టు రోడ్డు, రహమత్ నగర్, అరవింద్ నగర్, మల్లేశ్వరి రోడ్డు, పటేల్ రోడ్డు, బాబానగర్ తదితర ప్రాంతాల ప్రజలు 7382605302 నంబర్‌కు సంప్రదించాలి.
- **డీ-3 సెక్షన్:** కోవూరు నగర్, శ్రీనగర్ కాలనీ, రామ్‌నగర్, ఆర్కేనగర్, లక్ష్మీనగర్, మారుతినగర్, సీసీ నగర్, గౌరవ గార్డెన్స్, బ్యాంక్ కాలనీ, శాంతినగర్, రంగస్వామి నగర్ మొదటి రోడ్డు నుంచి 6వ రోడ్డు వరకు, హెచ్చెల్సీ కాలనీ, ఆజాద్ నగర్ ప్రజలు 7382605303 నంబర్‌కు ఫోన్ చేయాల్సి ఉంటుంది.
- **డీ-4 సెక్షన్:** హౌసింగ్ బోర్డు, ఆదర్శ నగర్, నాయక్ నగర్, సాయి నగర్, విద్యుత్ నగర్, శారద నగర్, చిన్మయ నగర్, కళాకారుల కాలనీ, లెనిన్ నగర్, రామకృష్ణ కాలనీ, జేఎన్‌టీయూ రోడ్డు, బుడ్డప్ప నగర్ తదితర ప్రాంతాల ప్రజలు 7382605304 నంబర్‌కు సంప్రదించాలి.
- **డీ-5 సెక్షన్:** విద్యారణ్య నగర్, తపోవనం, ప్రశాంతి నగర్, జనశక్తి నగర్, సోమనాథ్ నగర్, నారాయణపురం, బళ్లారి రోడ్డు, పాపంపేట, కళ్యాణదుర్గం రోడ్డు, ఏఎస్‌ఆర్ నగర్, జొన్నవీరయ్య కాలనీ, జాకీర్ కొట్టాల, రుద్రంపేట, వికలాంగుల కాలనీ, చంద్రబాబు కొట్టాల, బాలజీ విల్లాస్, ద్వారక విల్లాస్, నందమూరి నగర్, గణేష్ నగర్, పిల్లిగుండ్ల కాలనీ, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, స్టాలిన్ నగర్, రాయల్ నగర్, మహదేవ్ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు 7382605305 నంబర్‌కు ఫోన్ చేయాల్సి ఉంటుంది.
- **డీ-6 సెక్షన్:** జనచైతన్య కాలనీ, రాజీవ్ కాలనీ, నారాయణరెడ్డి కాలనీ, గుజ్జల సరళాదేవి నగర్, తారకరామ కొట్టాల, హమాలీ కాలనీ, బిందెల కాలనీ, గుత్తిరోడ్డు, మార్కెట్ యార్డ్, కల్పనాజోషి కాలనీ, షికారి కొట్టాల, విరుపాక్షి నగర్, చలమారెడ్డి నగర్, భాగ్యనగర్, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు 7382605306 నంబర్‌లో సంప్రదించాల్సి ఉంటుంది.